క్లుప్తంగా

ప్రజాపాలనపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మంథని: ఆరు గ్యారంటీ పథకాలకు అర్హుల ఎంపికను ప్రభుత్వం ఈ నెల 28 నుంచి చేపట్టే ప్రజా పాలన కార్యక్రమంపై మంథనిలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ మెప్మా ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బందితో సమావేశమై కలెక్టర్ ఆదేశాలను వివరించారు.

సర్టిఫికెట్ల ప్రదానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఎలైట్, శ్రీశక్తి వారి ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ పొందిన వారికి మంగళవారం సర్టిఫికెట్లను లయన్స్‌క్లబ్ గవర్నర్ రాజిరెడ్డి ప్రదానం చేశారు. నిరుపేద కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధించేలా లయన్స్‌క్లబ్ ఎలైట్ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. క్లబ్ ప్రతినిధులు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కుమార్, జైపాల్‌రెడ్డి, బాబురావు, అశోక్‌కుమార్, అనిల్, సంపత్‌రావు, భిక్షపతి, వెంకటేశ్, అతీఫ్, బత్తుల రమేశ్, వెంకటనారాయణ, కుమార్, శ్రీనివాస్, ఆనంద్, భాస్కర్, సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న టూటౌన్ సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులను మంగళవారం గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ అభినందించారు. బాలోత్సవాల సందర్భంగా గుంటూరు జిల్లా నంబూర్‌లో నిర్వహించిన పలు రకాల పోటీల్లో యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి, ద్వితీయ స్థానంలో నిహారిక, ఆర్.వైష్ణవి విజయం సాధించారు. సెపక్‌టాక్రా రెండో జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్న చరణ్, వినయ్ కుమార్‌తో పాటు జనవరి నెల 5 నుంచి 7 వరకు హర్యానాలో నిర్వహించనున్న జాతీయస్థాయి సెపక్‌టాక్రా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు శ్రీవైష్ణవి, సంహిత్, రిషిత, కార్తికేయకు సీఐ ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం రవీందర్, టూటౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నినాదాలు చేస్తున్న నాయకులు

ఓదెల: మండలంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మండలంలోని కనగర్తి, కొలనూర్, హరిపురం గ్రామాల్లో సీపీఐ రాష్ట్ర మాజీ కార్యవర్గసభ్యుడు తాళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఆవశ్యకత గురించి కొనియాడారు. కార్యక్రమంలో రైతులు, కూలీలు, నాయకులు పాల్గొన్నారు.

ట్రినిటిలో బాక్సింగ్ దినోత్సవం



బాక్సింగ్ డే ఉత్సవాల్లో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ బాక్సింగ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు బహుమతులు ఇచ్చి పుచ్చుకుని సంతోషపడ్డారు. ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎలిగేడు: మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో బుధవారం 10 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఆర్‌ఐ శైలజ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

జాతరకు ముందస్తు చర్యలేవి?

- ఫిబ్రవరిలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతర
- నీరుకుల్ల జాతరకు మూడు నుంచి నాలుగు లక్షలకు పైగా భక్తుల రాక
- ఈసారైనా ట్రాఫిక్ తిప్పలు తప్పేనా?
- సౌకర్యాలు కల్పించాలని భక్తుల వేడుకోలు



గతేడాది జాతరకు వచ్చిన జనం (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన నీరుకుల్ల-వేగురుపల్లి గ్రామాల మధ్య ఉన్న రంగనాయకస్వామి ఆలయం సమీపంలో గల సమ్మక్క-సారలమ్మ జాతర ప్రతి ఏటా అత్యంత వైభోవంగా జరుగుతుంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో రెండేళ్లకోసారి జరిగే జాతరకు పెద్దపల్లి జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం కోయ పూజారులు వచ్చి ఇక్కడ పూజలు చేయడం విశేషం.

ఫిబ్రవరిలో జాతర ప్రారంభం.. ఇబ్బందులు తప్పేనా?

రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర 2024 ఫిబ్రవరిలో జరగనుంది. కానీ భక్తులకు, బస చేసేందుకు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలి. ధ్వంసమైన రోడ్లను మరమ్మతు చేసి, భక్తులు బస చేసేందుకు, వంటలు చేసుకునేందుకు వీలుగా జాతర సమీపంలోని పంట పొలాల్లో పంటలు సాగు చేయకుండా ఆయా రైతులతో ఒప్పందం కుదుర్చుకొని పంట వేయకుండా చర్యలు తీసుకునే వారు. కానీ ప్రస్తుతం రైతులు పంటలు సాగు చేయడంతో భక్తులకు, ట్రాఫిక్ ఇబ్బందులు తప్పేనా అనే విధంగా పరిస్థితి నెలకొంది. మరో వైపు మానేరు వాగులో భక్తులు బస చేసేవారు. ఈసారి చెక్ డ్యాంతో పూర్తిగా నీటితో నిండి ఉండటంతో జాతర సమీపంలో ఉన్న పంట పొలాలే దిక్కయ్యే పరిస్థితి ఉంది. సమ్మక్క సారలమ్మ జాతరను రంగనాయకస్వామి దేవాలయం ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి జాతర నిర్వహిస్తోంది. ఇప్పటికైనా ముందస్తు చర్యలు చేపడితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని భక్తులు అంటున్నారు.

ట్రాఫిక్ సమస్య అధికం



రెండేళ్లకు ఒకసారి వచ్చే జాతరకు కుటుంబంతో సహా వెళ్తాం. జాతరలో ట్రాఫిక్, బస చేయడానికి ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రస్తుతం మానేరు చెక్‌డ్యాంతో స్థలం లేక ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. – అంజయ్య, నీరుకుల్ల

పరిశీలించి చర్యలు చేపడతాం

రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ జాతర జరగనుంది. జాతర ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి నివేదికను తయారు చేసి చర్యలు చేపడతాం.

– శంకరయ్య, ఎండోమెంట్ అధికారి



నీరుకుల్ల సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశం



గుంతల మయంగా జాతరకు వెళ్లే రోడ్డు



మానేరు వాగుపై చెక్ డ్యాం, నిండుగా ఉన్న నీరు

కనులపండువగా అయ్యప్పస్వామి శోభాయాత్ర



శ్రీఅయ్యప్పస్వామి శోభాయాత్రలో భక్తుల కోలాటం

యైటింక్లయిన్‌కాలనీ: మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్ప స్వామి శోభాయాత్రను మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని కాలనీ పురవీధుల గుండా ఆలయం నుంచి షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా మీదుగా షిర్కె బస్‌స్టాప్ నుంచి తెలంగాణ చౌరస్తా మీదుగా శోభాయాత్ర కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మండల పూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కర్నె అశోక్ శర్మ మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన గురుస్వామి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి జయంతి



రామగుండం: క్షీరాభిషేకం చేస్తున్న మేయర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి నిర్వహించారు. మంగళవారం వైకుంఠపురం హరిహర ఆలయంలోని దత్తాత్రేయ స్వామికి అర్చకులు రాంపెల్లి వామనశర్మ అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ్యుడు జనగామ తిరుపతి, అయ్యప్ప దేవాలయ ఇన్‌చార్జి సంపత్ రావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మంగళవారం శ్రీదత్తసాయి జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. కాగా నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ వేడుకలకు హాజరయ్యారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కుంకుమపూజలు చేశారు. ఆలయ పూజారి మురళీధరశర్మ, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు. కాగా ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీశ్‌కుమార్, ప్రతినిధులు కలవేణి మల్లేశం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వ్యర్థాలతో నిండిన గోదావరి



నదిలో పేరుకుపోయిన వ్యర్థాలు

రామగుండం: మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో గోదావరినదిలో ఉన్న వరద నీటిని కిందకు వదలడంతో ప్రస్తుతం ఇసుక తిన్నెలతో గోదావరినది కరువును తలపిస్తోంది. కాగా అంతర్గాం పరిధిలో ఉన్న గోదావరి నది పరిసరాల్లో ఉన్న గుంతల్లో మాత్రమే నీరు నిలిచి ఉండగా కొన్నినెలల క్రితం గణపతి నిమజ్జోత్సవం చేసిన విగ్రహాలు ఇతరత్రా వ్యర్థాలతో నదిలో నీరు దుర్వాసనతో పాటు మురుగును తలపిప్తోంది. ఫలితంగా గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా స్నానాలతో అంటువ్యాధులు సోకుతాయని భక్తులు భయాందోళనకు లోనవుతున్నారు. పారిశుధ్య సిబ్బందితో నది పరిసరాలు శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఐదునెలలుగా పెండింగ్‌లో బిల్లులు



అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించిన బిల్లులు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, జనరల్ ఫండ్ తదితర విభాగాలకు చెందిన శాఖల నుంచి నిధులు వినియోగించినప్పటికీ జూలై నుంచి బిల్లులు మంజూరు కానట్లు మండల పరిషత్ నివేదికల్లో పేర్కొన్నారు. మొత్తంగా పలు గ్రామాల్లో వెచ్చించిన నిధుల పెండింగ్ బిల్లులు రూ.33.10లక్షలు ఉన్నట్లు వెల్లడించారు.

సంక్షిప్త వార్తలు

నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని బుధవారం పార్టీ జిల్లా కార్యాలయం (రాఘవాపూర్)లో ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు అయ్యప్పస్వామి మండలపూజ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తుల ఆధ్వర్యంలో బుధవారం మండల పూజ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7గంటలకు స్వామివారికి ప్రత్యేక అభిషేకంతో పాటు ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం, సాయంత్రం పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అందుబాటులో జింక్ సల్ఫేట్

జూలపల్లి: మండలంలోని రైతులు పొలాల్లో వాడే జింక్ సల్ఫేట్ అందుబాటులో ఉందని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో సురేశ్ తెలిపారు. రైతులు తమ పాస్‌బుక్ జిరాక్స్‌తో వచ్చి 10కిలోలకు రూ.500 చొప్పున చెల్లించి జింక్ తీసుకోవాలని సూచించారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఓదెల: మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లె గ్రామంలో నూతన గ్రామపంచాయతీ పక్కాభవన నిర్మాణం, సీసీరోడ్ల నిర్మాణాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బుధవారం శంకుస్థాపన చేస్తారని సర్పంచు పిట్టల సరిత రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో జీపీ పక్కాభవనం కోసం స్థలాన్ని దానం చేయనున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



వ్రతంలో పాల్గొన్న దంపతులు

జూలపల్లి: ధనుర్మాసోత్సవాలలో భాగంగా టీటీడీ, హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను, భక్తిశ్రద్ధలతో, కనుల పండువగా నిర్వహించారు. వికాస తరంగిణి ధర్మప్రచార కర్త ఎనగంటి రామ్మోహన్‌రావు, రమాదేవి స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీసత్యనారాయణ వ్రతాలను ఆలయ పూజారి రంగనాథచార్యులు నిర్వహించారు. జూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య దంపతులు, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ దంపతులు, కొంజెర్ల సంతోష్, అందె ప్రసాద్, మల్లేశం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'ట్రేడ్ లైసెన్స్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారు'



ఎమ్మెల్యే విజయరమణారావుతో వ్యాపారులు

సుల్తానాబాద్: పట్టణంలోని ట్రేడ్ లైసెన్సుల ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌ను పిలిచి వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిన్న షెటర్లు, పెద్ద షెటర్లు ఫీజులు అధికంగా ఉండడంతో ఉపాధి లేక జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తగ్గించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అన్నయ్యగౌడ్, ఉట్ల వరప్రదీప్, కుమార్ కిషోర్, ముస్త్యాల రవీందర్, రఫిక్, రాజు, రాజయ్య, దేవేందర్, కిరణ్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును మార్వాడీ సేవాసమాజ్ సంఘం సభ్యులు నాయకులు మంగళవారం సత్కరించారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్దగల హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం నాయకులు సత్కరించారు.

ఎమ్మెల్యేకు వేద పండితుల ఆశీర్వచనం

ఎలిగేడు: మండలంలోని శివపల్లి గ్రామంలోని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కందుకూరు ఈశ్వరచారి ఆధ్వర్యంలో ఆశీర్వచనం గావించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మగువ లయన్స్ క్లబ్ సేవలు భేష్



బ్లాంకెట్లు, చీరలు అందిస్తున్న రాజిరెడ్డి

కోల్‌సిటీ: మగువ రామగుండం లయన్స్ క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి కొనియాడారు. మంగళవారం జిల్లా గవర్నర్ గోదావరిఖనిలో నిర్వహించిన స్పెషల్ బోర్డ్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్‌కు మగువ లయన్స్ క్లబ్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల నివేదికను క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మీవాణి సమర్పించారు. క్లబ్ పనితీరుపై జిల్లా గవర్నర్ ప్రశంసలు కురిపించారు. క్లబ్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు అవినీతి నిరోధనపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం నిరుపేద కుటుంబాల మహిళలకు బ్లాంకెట్లు, చీరలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక జీఎంకాలనీలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి వెంకటరమణారెడ్డి, కోశాధికారి సామ రాజేంద్రప్రసాద్, రీజియన్ చైర్మన్ ఊట్ల అశోక్‌కుమార్, జోన్ చైర్మన్ సోమవారపు లావణ్య, సంక్షేమ, సూర్యదేవర జ్యోతి, బీనా సింగ్, మగువ లయన్స్ క్లబ్ కార్యదర్శి జి.సునీత, కోశాధికారి ఎ.శశికళ పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించిన మక్కాన్‌సింగ్ అభిమాని



ఆలయంలో పార్టీ నాయకులు

జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ గెలిచినందుకు ఆయన అభిమాని ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎండీ.శాబుద్దీన్ ఎన్నికల్లో మక్కాన్‌సింగ్ గెలిస్తే ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొడతానని మొక్కుకున్నాడు. దీంతో హనుమాన్ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎండీ రహీం, సీనియర్ నాయకుడు అబ్దుల్లా, ఆలయ అర్చకులు రుద్రభట్ల సత్యనారాయణ, రమేశ్, సురేశ్, శ్రీనివాస్, మార్కండేయ, అశోక్, అంజి, ఇనాయత్ పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు మెంబర్‌గా మాతంగి రేణుక



గోదావరిఖనిటౌన్: సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా పట్టణానికి చెందిన బీజేపీ నాయకురాలు మాతంగి రేణుక నియమితులయ్యారు. 2009 నుంచి మున్సిపల్ ఏరియా, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేశారు. రెండుసార్లు బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, జిల్లా ఇన్‌చార్జి రావుల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు రేణుక కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



కండువా కప్పుతున్న తిరుపతియాదవ్

రామగిరి: ఆర్జీ-3 పరిధిలోని ఏపీఏ గనికి చెందిన ఐఎఫ్‌టీయూ కేంద్ర కమిటీ సభ్యుడు తోట్ల రాయమల్లు యాదవ్‌తో పాటు సుమారు 20 మంది నాయకులు మంగళవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. కాగా వారికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, మర్రి ఓదెలుయాదవ్, పెద్ది సమ్మయ్య, బత్తుల రమేశ్, వనం రాంచందర్‌రావు, ఏల్లె రామ్మూర్తి, దేవ రామస్వామి, తాళ్లపల్లి నారాయణగౌడ్, కుమార్‌స్వామి, పీవీ గౌడ్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

శ్రీఅభయకృష్ణ ఆలయంలో వార్షిక వేడుకలు



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

ధర్మారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీఅభయకృష్ణ ఆలయంలో ప్రథమ వార్షిక వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. 101 మంది జంటలు సుదర్శన హోమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బద్దం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాటు చేయగా అర్చకులు బ్రహ్మచారి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, గుండా బాపురెడ్డి, బద్దం గంగారెడ్డి, స్వర్గం భూమేశ్, బద్దం ఎల్లారెడ్డి, ప్రభాకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో 9వ వార్డులో రూ.3లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, వార్డుసభ్యులు రంగు శ్రీలత, గీస నర్సమ్మ, ఆవుల ఎల్లమ్మ, దాసరి వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, మాజీ వార్డుసభ్యుడు ఇరుగరాల తిరుపతి పాల్గొన్నారు.

సంతాప సభ

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కుందారపు రాజమ్మ ఇటీవల మృతి చెందగా నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కాగా మంగళవారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజమ్మ కుటుంబ సభ్యులకు సన్మాన పత్రాన్ని కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అందజేశారు. నల్లవెల్లి శంకర్, మాజీ సర్పంచ్ కుందారపు బాపు, కె.ఎస్, వాసు, బాలయ్య, రవివర్మ పాల్గొన్నారు.